

# వరుసగా 3వసారి అఖండ విజయం చేకూర్చినందుకు ధన్యవాదాలు

**- బిఎస్ఎన్ఎల్ఇయు**

సోదరీ సోదరులారా!

21-1-2009న దేశవ్యాపితంగా బిఎస్ఎన్ఎల్‌లో జరిగిన యూనియన్ గుర్తింపు ఎన్నికలలో ఐక్యవేదిక మద్దతుతో పోటీచేసిన బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్‌కు 1,24,053 ఓట్లు వచ్చాయి. ఎన్ఎఫ్‌టిఇ-ఎఫ్ఎన్‌టిఓ కూటమి తరఫున పోటీచేసిన ఎన్ఎఫ్‌టిఇకి 95,225 ఓట్లు వచ్చాయి. బిటిఇయు (బిఎంఎస్)కి 4,174 ఓట్లు మాత్రమే వచ్చి నామమాత్రం అయింది. పోటీలో ఉన్న ఇతర యూనియన్లకు వచ్చిన ఓట్లు ఇంకా స్వల్పంగా వున్నాయి. **28,828 ఓట్ల మెజారిటీతో బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ అఖండ విజయాన్ని సాధించింది. వరుసగా మూడవసారి అఖండ విజయం చేకూర్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాము.**

**ఇప్పటి నుండి రెండు సంవత్సరాలు బిఎస్ఎన్ఎల్‌లో అఖిల భారత / సర్కిల్ / జిల్లా- అన్ని స్థాయిలలో ఏకైక గుర్తింపు యూనియన్‌గా బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ కొనసాగుతుంది.**

1954 నుండి 2004 వరకు 50 సంవత్సరాలలో గుర్తింపు యూనియన్లుగా వున్న ఎన్ఎఫ్‌టిఇ, ఎఫ్ఎన్‌టిఓలు ఉద్యోగుల, ప్రజల ప్రయోజనాలు పట్టించుకోలేదు. సరైన డిమాండ్స్ రూపొందించ లేదు. ఉద్యోగులలో కొత్త చైతన్యాన్ని సృష్టించలేదు. కార్మికవర్గ ఐక్య పోరాటాలను బలపరచలేదు. ప్రైవేటీకరణ విధానాలను ప్రతిఘటించలేదు.

ఇందుకు భిన్నంగా గత నాలుగు సంవత్సరాల గుర్తింపు కాలంలో బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ సరైన డిమాండ్స్ రూపొందించింది. ఉద్యోగులందరికీ వర్తించే అనేక ఆర్థిక ప్రయోజనాలు సాధించింది. ఉద్యోగులు, అధికారులు అందరూ ఐక్యంగా పోరాడి ప్రైవేటుపరం కాకుండా బిఎస్ఎన్ఎల్‌ను కాపాడాలనే చైతన్యాన్ని పెంపొందించింది. ఈ పోరాటంలో ప్రతి ఉద్యోగి ఒక నాయకుడిగా ఎదిగేందుకు తోడ్పడింది. ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా జరిగిన కార్మికవర్గ ఐక్య పోరాటాలలో పాల్గొని ఉద్యోగుల భవిష్యత్తును, ప్రజా ప్రయోజనాలను కాపాడాలనే చైతన్యాన్ని పెంపొందించింది. ఈ పోరాటాల వలన మరియు యుపిఏ ప్రభుత్వంపై వామపక్షాలు తెచ్చిన ఒత్తిడి వలన ప్రభుత్వరంగ సంస్థలను, బ్యాంకులను, ఇన్సూరెన్సు సంస్థలను, పెన్షన్ నిధులను, ప్రావిడెంట్ ఫండ్‌నిధులను ప్రైవేటుపరం కాకుండా కాపాడుకో గలిగాము. ఇవన్నీ ప్రైవేటుపరమైన అమెరికా, యూరప్, తదితర దేశాలలో ఇటీవల ఏర్పడిన తీవ్ర ఆర్థిక సంక్షోభం కారణంగా లక్షలాదిమంది తమ ఉద్యోగాలను కోల్పోయారు. బ్యాంకు డిపాజిట్లను, ఇన్సూరెన్సు మరియు పెన్షన్ నిధులను కోల్పోయారు.

మూడవసారి గుర్తింపు యూనియన్‌గా ఉద్యోగులు ఇచ్చిన ఈ బాధ్యతను బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ వినమ్రతతో స్వీకరిస్తున్నది. త్వరలో మంచి వేతన సవరణ ఒప్పందం, పే ఎనామలీస్ పరిష్కారం, ప్రమోషన్ పాలసీ అమలు, ప్రమోషన్లు/అప్‌గ్రెడేషన్లలో ఎస్‌సి/ఎస్‌టి రిజర్వేషన్ల అమలు, రెగ్యులర్‌గా ప్రమోషన్ పరీక్షల నిర్వహణ, ప్రమోషన్ పరీక్షలు రాసేందుకు అర్హతల సడలింపు, క్వాలిఫై అయి వెయిటింగ్ లిస్టులో వున్నవారికి పర్సనల్ అప్‌గ్రెడేషన్ ప్రాతిపదికన టిఎం/జెటిఓ ప్రమోషన్, డిజిగ్నేషన్స్ మార్పు, వివిధ కేడర్ల సమస్యల పరిష్కారం, కంపాషనేట్ అపాయింట్‌మెంట్స్, క్యాజువల్ లేబర్ రెగ్యులరైజేషన్ తదితర డిమాండ్స్ పరిష్కారానికి బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ శక్తివంచన లేకుండా కృషి చేస్తుంది. ఉద్యోగులు, అధికారులు అందరినీ కలుపుకుని బిఎస్ఎన్ఎల్ పరిరక్షణ మరియు అభివృద్ధి కోసం మరియు నవరత్న హోదా సాధించేం దుకు, బిఎస్ఎన్ఎల్‌లో ఐటిఎస్ అధికారుల విలీనం కోసం కృషి చేస్తుంది. ప్రపంచ వ్యాపితం గా ఏర్పడిన ఆర్థిక సంక్షోభం వలన బడా పెట్టుబడిదారుల లాభాలు పడిపోకుండా కాపా డేందుకు ప్రైవేటీకరణ విధానాలను మరింత జోరుగా అమలు చేయాలని పాలకవర్గాలు చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా జరిగే కార్మికవర్గ ఐక్య పోరాటాలలో పాల్గొనేందుకు బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులను సమీకరించి ఆ పోరాటాలను బలపరుస్తుంది. తద్వారా ఉద్యోగుల భవిష్యత్తును కాపాడుతుంది.

ఈ కర్తవ్యాల నిర్వహణకు సహకరించాల్సిందిగా బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులందరికీ, బిఎస్ఎన్ఎల్‌లో ఉన్న అన్ని యూనియన్లకు బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ విజ్ఞప్తి చేస్తున్నది.

అభినందనలతో...

BSNLEU

**బి.ఎస్.ఎన్.ఎల్. ఎంప్లాయీస్ యూనియన్**

**............................జిల్లా శాఖ**